




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 315 | ది. 27-2-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 315 | Date : 27-2-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు..

## విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి


- పైలెట్ ప్రాజెక్టు తరహాలో నియోజకవర్గంలో ఒకటి
- ఆరుట్ల పాఠశాల తరహాలో సకల వసతులు, రవాణా సౌకర్యం కల్పన
- క్యూర్‌లో ఏడాదిలో సకల వసతులతో ప్రభుత్వ పాఠశాలలు సిద్ధం కావాలి..
- 99 రోజుల కార్యక్రమంలో వారం రోజులు పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు
- ముఖ్యమంత్రికి తెలంగాణ విద్యా విధానం నివేదిక అందజేసిన కమిషన్ సభ్యులు
- నివేదికలో చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు.. అమలు చేయాల్సిన అంశాలపై కేశవరావు కమిటీకి అప్పగింత
- ఫీజుల నియంత్రణపై రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ



**హైదరాబాద్,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని సీఎం ఆదేశించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని సీఎం పేర్కొన్నారు. ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని సీఎం ఇంజినీర్లను ఆదేశించారు. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలని సీఎం తెలిపారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని సీఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కృత్రిమ మేథ (ఏ 1) ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఏఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏ×తో ప్రపంచ వ్యాప్తంగా వచ్చే మార్పులను తెలుసుకొని దాని ద్వారా వచ్చే అవకాశాలు మన విద్యార్థులే అందిపుచ్చుకునేలా మన సన్నద్ధత ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని సీఎం పేర్కొన్నారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బ్రేక్ ఫాస్ట్ అందజేతకు సంబంధించి అధికారులు, హరేకృష్ణమిషన్ ప్రతినిధులకు సీఎం పలు సూచనలు చేశారు. బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు ప్రతి విద్యార్థికి పాలు అందజేయాలని.. ఇందుకు పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ఎన్ని క్యాలరీలు అందజేస్తున్నామనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ప్రతీ ఎకరాకు నీటితో తెలుగు తల్లికి జలహారతి

- రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై త్వరలో బ్లూప్రింట్
- మే 15 కే నారుమళ్లకు నీళ్లిచ్చేలా ప్రణాళిక
- నీటి భద్రతపై దీర్ఘకాలిక విజన్ కూటమి ప్రభుత్వానిది
- వెలిగొండకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి గత పాలకుల క్రెడిట్ చోరీ
- సాగునీటి రంగంపై చర్చ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ప్రతీ ఎకరాకూ నీరందించి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వటమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టులను పూర్తి చేసే అంశంపై త్వరలోనే బ్లూ ప్రింట్ తయారు చేస్తామని శాసనసభలో వెల్లడించారు. సాగునీటి రంగానికి బడ్జెట్ కేటాయింపులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా పదిసూత్రాలను రూపొందించుకుని నీటి భద్రతపై కూటమి ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆయన అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నా నీటి భద్రత అత్యంత కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది గోదావరి, మరుసటి ఏడాదిలో కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి వచ్చిందని అన్నారు. ప్రకృతిని, నదులు, నీటి వనరులను ఆరాధించే సంస్కృతి ఉన్న నేపథ్యంలో గోదావరి నదికి అఖండ హారతిని, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇచ్చి జలాలను అత్యంత విలువైన వనరులుగా భావించి బాధ్యతగా వ్యవహరిస్తున్నామని సీఎం అన్నారు. ప్రతీ ఏటా గోదావరి నది నుంచి సగటున 3 వేల టీఎంసీల వరద నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని అన్నారు. అందుకే రాష్ట్రంలోని వంశ ధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలోని నదులను అనుసంధానిస్తే నీటి సమస్యలు పరిష్కారం అవుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోనూ గంగా- కావేరి నదుల అనుసంధానం జరగాలన్నది తన బలమైన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గతంలో వాజ్ పేయి ప్రభుత్వంలో గంగా- కావేరీ నదుల అనుసంధాన సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిగాయన్నారు. అందుకే రాష్ట్రంలో నదులు అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ప్రాజెక్టులన్నీ మా హయాంలో కట్టినవే..** 2014-19 మధ్య సాగునీటి రంగానికి రూ.68 వేల కోట్ల వ్యయం చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గడచిన 20 నెలల్లో రూ.20 వేల కోట్లను ఈ రంగానికి వెచ్చించినట్టు తెలిపారు. 738 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువను విస్తరించి కుప్పంలో పరమసముద్రం చెరువు వరకూ నీటిని తీసుకెళ్లామని అన్నారు. మడకశిర వరకూ నీటిని తీసుకెళ్లి ఆ ప్రాంత వాసుల దాహార్తిని తీర్చామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టుల న్నీ టీడీపీ, కూటమి హయాంలో నిర్మించినవేనని సీఎం స్పష్టం చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ కట్టిన కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నామని అన్నారు. ఆనాడు రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టింది ఎన్టీఆర్ అని సీఎం స్పష్టం చేశారు. పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు నీరిచ్చి, శ్రీశైలంలో 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని.. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా మారిందన్నారు. వెలిగొండ పూర్తి చేసి మార్కాపురం, ప్రకాశం జిల్లా సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. 30 ఏళ్లకు ముందు ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని.. ఇప్పుడు ఈ ఏడాది జూలైలోనే మొదటి దశ పూర్తి చేసి నీళ్లు ఇస్తామని అన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయాలంటే ఇంకా రూ.2500 కోట్ల మేర వ్యయం చేయాల్సి ఉందని .. బుధవారమే రూ.456 కోట్ల వ్యయంతో ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసినట్టు వివరించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే రిబ్బన్ కట్ చేసి క్రెడిట్ చోరీ చేసే ప్రయత్నం గత పాలకులు చేశారని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. కుప్పంలోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో నీళ్లు పోశారని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపైనా గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని సీఎం ఆక్షేపించారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని వివరించారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి.. డయాఫ్రాం వాల్ ను గోదాట్లో కలిపేశారని సీఎం వ్యాఖ్యానించారు. మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టించి పుష్కరాలకంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. అలాగే చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాల్లోని ఎగువ భూములకు నీరందేలా చర్యలు చేపడతామన్నారు.

**ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు..** రాష్ట్రంలోని అన్ని చిన్నా పెద్ద రిజర్వాయర్లలో 1312 టీఎంసీల మేర నిల్వ చేసుకునే అవకాశం ఉందని ప్రస్తుతం 793 టీఎంసీల మేర నీటితో రిజర్వాయర్లు కళకళ లాడుతున్నాయని సీఎం అన్నారు. అందుకే పంట సీజన్ ను ముందుకు జరిపేలా మే 15 నాటికే నారుమళ్లకు నీరు ఇచ్చేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులంతా రైతులను చైతన్యవంతులను చేయాలని స్పష్టం చేశారు. 16 లక్షల హెక్టార్ల మైక్రో ఇరిగేషన్ తో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉందని ముఖ్యమంత్రి వివరించారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి.. మాతృభాషను మరువొద్దు

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు





**అమరావతి,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే దిశగా కొనసాగుతున్న ఏపీ అసెంబ్లీ విజ్ఞాన యాత్రలో భాగంగా మంగళవారం 495 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. గత పది రోజులుగా ఉత్సాహంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 107 పాఠశాలలకు చెందిన 3,718 మంది విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. చిన్న వయసులోనే సభా కార్యక్రమాలను చూసే అవకాశం దక్కడం పట్ల విద్యార్థులు అమితానందం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా నర్సీపట్నం రిషి వ్యాలీ స్కూల్‌కు చెందిన 120 మంది విద్యార్థులు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని ప్రత్యేకంగా కలిశారు. సభా విరామ సమయంలో వారితో ఆత్మీయంగా ముచ్చటించిన స్పీకర్.. విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన సందేహాలను ఓపికగా నివృత్తి చేశారు. అసెంబ్లీని సందర్శించిన ఈ విద్యార్థులందరికీ త్వరలోనే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును సైతం చూసే అవకాశం కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. యువత కేవలం చదువు, ఉద్యోగాలు, కుటుంబం వరకే పరిమితం కాకుండా.. సమాజానికి మెరుగైన సేవలు అందించేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో మాతృభాష ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఇళ్లలో ఆంగ్లం కాకుండా తెలుగులోనే మాట్లాడాలని, 'మమ్మీ, డాడీ' అనడానికి బదులుగా మన సంస్కృతి ఉట్టిపడేలా 'అమ్మ, నాన్న' అని ఆప్యాయంగా పిలవాలని విద్యార్థులకు సూచించారు. మన తెలుగు భాషను, మూలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోకూడదని ఆయన హితబోధ చేశారు.

# ఏపీ సీఎస్ విజయానంద్‌కు బంపరాఫర్

- రిటైర్ అయిన తర్వాత కీలక పదవి
- ఆ ఛైర్ వెయిటింగ్ వారి కోసమే..?

**విజయవాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పదవీకాలం ముగియనుంది. మరో మూడు రోజులు మాత్రమే పదవీకాలం ఉంది. గతేడాది నవంబర్‌లో విజయానంద్ పదవీకాలం ముగిసింది. అయితే సీఎం చంద్రబాబు నాయుడు మరో మూడు నెలలు పొడిగించాలని కేంద్రాన్ని కోరారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏపీ సీఎస్‌గా విజయానంద్ కొనసాగనున్నారు. విజయానంద్ పదవీకాలం ముగియనుండటంతో నెక్స్ట్ సీఎస్‌ఎవరా అనేదానిపైనా ప్రభుత్వం ఇప్పటికే క్లియరెన్స్ ఇచ్చింది. నెక్స్ట్ సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే విజయానంద్ సేవలు మరికొంతకాలం ఉపయోగించుకోవాలనే యోచనలో సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో విజయానంద్‌ను ఎలాంటి పదవి వరించనుంది..? ఏ పదవి కట్టబెట్టబోతున్నారు? అనేదానిపై చర్చ జరుగుతుంది.

**నెక్స్ట్ సీఎస్ సాయిప్రసాద్..** ఆంధ్రప్రదేశ్ సీఎస్‌గా విజయానంద్ పదవీ విరమణ చేయనున్నారు. ఫిబ్రవరి నెలాఖరును ఆయన రిటైర్మెంట్ కానున్నారు. ఈ క్రమంలో నెక్స్ట్ సీఎస్‌గా సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టనున్నారు. విజయానందర్ తర్వాత నెక్స్ట్ సీఎస్ ఎవరా అనేదానిపై ప్రభుత్వం పెద్ద కసరత్తే చేసింది. సీనియారిటీ ప్రకారం 1988 బ్యాచ్‌కి చెందిన శ్రీలక్ష్మి, 1990 బ్యాచ్‌కు చెందిన అనంత రాము, 1991 బ్యాచ్‌కు చెందిన జీ సాయిప్రసాద్, అజయ్ జైన్, సుమితా దవ్రా, ఆర్పీ సిసోడియాలు రేసులో ఉన్నారు. అయితే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు సీఎస్ ఎంపికలో సాయి ప్రసాద్ వైపు మొగ్గు చూపారు. విజయానంద్ పదవీకాలం 2026 ఫిబ్రవరితో ముగియనుంది. ఈ నేపథ్యంలో తర్వాత సీఎస్‌గా జీ సాయిప్రసాద్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎస్‌గా సాయి ప్రసాద్ 2026 మే వరకు కొనసాగనున్నారు. సీఎస్‌గా విజయానంద్ రిటైర్ అయితే ఆ తర్వాత సీఎస్‌గా సాయిప్రసాద్‌ను బాధ్యతలు చేపటనున్నారు. సాయిప్రసాద్ పదవీకాలం కూడా పొడిగించి సీఎస్‌గా కొనసాగించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.



**సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా విజయానంద్..?** మరోవైపు సీఎస్‌గా విజయానంద్ పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిస్థాయిలో సంతృప్తికరంగా ఉన్నారు. సీఎస్‌గా విజయానంద్ పనితీరుపై ఫిదా అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన సేవలను మరింత కాలం వినియోగించుకోవాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విజయానంద్‌ను సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపోతే సీఎస్ విజయానంద్ బీసీ (యాదవ) సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాక అసాధారణ అద్వితీయ అధికారిగా పేరుగాంచారు విజయానంద్. ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ, రంగారెడ్డి, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో కలెక్టర్‌గా, 6గురు సీఎంలు మారిన విజయానంద మాత్రం ఏపీ ట్రాన్స్ కో, ఏపీ జెన్ కో సీఎండీగా పనిచేసిన విధానం అద్భుతం గా పేరుగాంచారు. . రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎనర్జీ, ఐటి మంత్రిత్వ శాఖల ముఖ్యకార్యదర్శి(ప్రిన్సిపల్ సెక్రెటరీ)గా పనిచేయడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే. 2024 డిసెంబర్ 30 నుంచి సీఎస్‌గా పనిచేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో ఆయన పదవీకాలం ముగియడంతో 2026 ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించారు. దీంతో ఈనెలాఖరున ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత విజయానంద్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకునేందుకు సీఎం ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులు అయ్యే అవకాశం ఉంది అని తెలుస్తోంది.

# చేనేత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు చేనేత ఉత్పత్తుల విక్రయాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను మంత్రి కొలుసు పార్థసారథి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత ఉత్పత్తులను, వాటి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల స్పందనతో అమ్మకాల గురించి ఆరా తీశారు. నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నారు. చేనేత సహకార సంఘాలకు విడతలవారీగా బకాయిలు సైతం విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నారని మంత్ర కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు.

# మార్చి 4వ తేదీన శాసన మండలిలో తిరుపతి లడ్డుపై లఘు చర్చకు సిద్ధం:ఆర్థికమంత్రి




**అమరావతి,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** రాష్ట్ర శాసన మండలిలో మార్చి 4వతేది బుధవారం తిరుపతి లడ్డు అంశంపై లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆర్థిక మరియు శాసన సభా వ్యవహారాల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ వెల్లడించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఏసి సమావేశంలో నిర్ణయం తీసుకున్న ప్రకారం శాసన మండలిలో తిరుపతి లడ్డుపై చర్చించుందకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం వ్యవసాయ శాఖపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. శాసన మండలిలో తిరుపతి లడ్డు అంశంపై రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి స్టేట్మెంట్ ఇచ్చే ప్రయత్నం చేస్తే చదవడానికి వీలు లేదు ముందుగా వైసిపి సభ్యులు మాట్లాడాలని అడ్డుతగలడం సరికాదని పేర్కొన్నారు. సాధారణంగా బిజినెస్ అడ్వైజరీ కమిటీలో చర్చకు నిర్ణయం తీసుకున్న తర్వాత సంబంధిత మంత్రి సభలో స్టేట్మెంట్ చదవడం జరుగుతుందని అయితే సభ్యులు ముందుగా మాట్లాడాలని డిమాండ్ సాంప్రదాయం కాదని ఖండించారు. కేవలం వైసిపి సభ్యులు సభకు రావాలి, అల్లరి చేయాలి, బట్ట కాల్చి మొఖాన వేయాలని ధోరణితో సభకు వచ్చి వాక్ అవుట్ చేసి పోతున్నారన్నారు. వైసిపి వాక్ అవుట్ అవుట్ పార్టీగా మారిపోయిందని మంత్రి పయ్యావుల ఎద్దేవా చేశారు. ఎందుకంటే వాస్తవాలు కళ్ళ ముందు కొస్తే వైసిపి సభ్యులు తట్టుకోలేరు కనుక ఆవిధంగా అడ్డుపడుతున్నారని మంత్రి కేశవ్ పేర్కొన్నారు.

## పసికందు మౌనిక మరణంపై నిప్పులు చెరిగిన సిపిఐ, రజక సంఘం: జగద్గిరిగుట్టలో భారీ కోవత్తుల ర్యాలీ

● *కుల దురహంకార దాడిలో ప్రాణాలు కోల్పోయిన రెండు నెలల పసిపాప.* ● *ప్రభుత్వానివి ప్రగల్భాలే.. చేతల్లో శూన్యం: సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.* ● *నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్.*




**జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 26, (వార్తాప్రభ) :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా జరిగిన దాడిలో రెండు నెలల పసికందు మౌనిక ప్రాణాలు కోల్పోవడం అత్యంత హేయమైన చర్య అని సిపిఐ మరియు రజక సంఘం నేతలు మండిపడ్డారు. ఈ ఘటనకు నిరసనగా గురువారం సాయంత్రం జగద్గిరిగుట్టలో కోవత్తుల ర్యాలీ నిర్వహించి, మౌనిక ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

**రసీదు అడిగితే దాడి చేస్తారా?** ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మరియు రజక సంఘం నాయకులు విట్టల్ మాట్లాడుతూ.. ఆలయంలో ఇచ్చే డబ్బులకు రసీదు అడిగినందుకు చాకలి కుటుంబంపై దాడి చేయడం అనాగరికమని ధ్వజమెత్తారు. ఈ కుల దురహంకార దాడిలోనే పసిపాప మౌనిక మరణించిందని, ఘటన జరిగి ఇన్ని రోజులైనా ప్రధాన నిందితులను అరెస్ట్ చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు.

**సీఎం రేవంత్ రెడ్డికి హెచ్చరిక** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను బీసీల బంధువునని చెప్పుకోవడం తప్ప, క్షేత్రస్థాయిలో వారికి రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. బీసీల పట్ల తనకు నిజంగానే ప్రేమ ఉంటే, తక్షణమే నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులకు వెనుక ఎవరున్నా వదిలిపెట్టవద్దని, బాధితులకు తగిన పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఏసురత్నం, రజక సంఘం నాయకులు భాస్కర్, నాగరాజు, చంద్రమౌళి, సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్, సతీష్, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఖాదీ మహోత్సవం 2026 లో సందడి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ):** మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఖాదీ మహోత్సవం--2026 సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందడి చేశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తిరునగిరి లలిత శిష్య బృందం సమర్పించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. బ్రహ్మాంజలి, వినరో భాగ్యము, కొలువైతివారంగా సాయి, బ్రహ్మమొక్కటే, గణేశా స్తుతి, రామాయణ శబ్దం,పరమపురుషుడు, దశావతార శబ్దం, మహాగణపతిమ్, పలుకే బంగారమాయెనా, జనుత శబ్దం, బృందావన నిలయే, జాలరులు కురియగా, నారాయణతే నమో నమో, జతిస్వరం అంశాలను శిష్యులు సమర్పించారు. విస్మయ, దేదీప్య, అనులేక, వేణిక, హనీషా, మానస, జాహ్నవి, గాయత్రీ, సుదేర్శన, తన్మయీ, శ్రీనిధి, అద్వితీ, భావన తదితరులు తమ నృత్య కౌశలంతో మెప్పించారు.

## ఘనంగా ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుక



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ):** చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు,లోకసభ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి,బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు సీతారామ రాజు తదితర నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని,ఆయురారోగ్యాలతో సుదీర్ఘకాలం సేవలందించాలని,భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ఆయన విశేష సేవలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సాయి నామ శతకోటి జప మహాయజ్ఞం ఘనంగా ముగింపు.



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 26)** :దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్‌లో నిర్వహించిన శ్రీ సాయి నామ శతకోటి (వంద కోట్లు) జప మహాయజ్ఞం ముగింపు ఉత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగాఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై ప్రసంగిస్తూ.. సాయి నామ జప యజ్ఞం భక్తులకు ఆధ్యాత్మిక శాంతిని ప్రసాదించే మహోన్నత కార్యక్రమమని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో భాగమయ్యారు. గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, ట్రస్ట్ చైర్మన్ శ్యాం కుమార్, మాజీ చైర్మన్ గుండ మల్లయ్యతో పాటు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఐక్యంగా కదులుదాం!!

● కార్మిక సంఘాల ఐక్యవేదిక గర్జన ● హక్కుల పోరాటానికి సిద్ధం కావాలి ● కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి ● ఏడాదికి నాలుగు కొత్త గనుల ఏర్పాటు చేయాలి ● తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి మనుగడ కోసం, కార్మిక హక్కుల పరిరక్షణకై ఐక్యంగా ఉద్యమించాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గోదావరిఖనిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు రియాజ్ అహ్మద్, సాము రాజన్న, విశ్వనాథ్, మాతంగి రాయమల్లు, ఏడుకొండలు తదితరులు మాట్లాడుతూ...... ఏటా నాలుగు కొత్త గనులను ప్రారంభించాలని, పరుగు పందెం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పాత గనుల్లో షాఫ్ట్‌లు నిర్మించి బొగ్గు ఉత్పత్తి పెంచాలని, ఓబీ పనులను సింగరేణి కార్మికులే చేపట్టాలని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం గడువు ముగిసినందున తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు అన్ని సంఘాలకు సమాన హోదా కల్పిస్తూ కమిటీల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. సింగరేణి భవిష్యత్తు కోసం కార్మికులంతా ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు తిప్పారావు, సారయ్య, కుమారస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రామగుండమే లక్ష్యం!!

● భావి అవసరాల కోసం మాస్టర్ ప్లాన్ ● నిధుల సేకరణే ధ్యేయం ● సమిష్టి కృషితో అభివృద్ధి ● మేయర్ మహంకాళి స్వామి


కోయ శ్రీహర్ష, కమిషనర్ అరుణ శ్రీ, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**స్వచ్ఛ రామగుండమే లక్ష్యంగా ప్రజా పాలన సాగిస్తామని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్ లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం మేయర్ మాట్లాడారు. స్వచ్ఛ రామగుండం లక్ష్యంగా రూ. 10 లక్షల వ్యయంతో ఇంటింటికీ ఉచిత చెత్త బుట్టల పంపిణీ ఫైలుపై ఆయన తొలి సంతకం చేశారు. నగర సానిటేషన్ ప్రక్షాళనతో పాటు, రాబోయే 20 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా అధిక నిధులు సాధించేందుకు ఏప్రిల్ 1, 2026 నుండి ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, ఇక్కడే నివసిస్తున్న వారు జనగణన అలాగే కుల గణనలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. సమగ్ర నగరాభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ముఖ్యమంత్రి సహకారంతో డి.పి.ఆర్ సిద్ధం చేసి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్

# ప్రజా ఉద్యమ కెరటం"సిపిఐ" తిరుపతి!!

● పార్టీ పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న నాయకుడు● ప్రజా సమస్యలే ఊపిరిగా పోరాడిన ప్రజా నేత ● 41వ డివిజన్ కార్పోరేటర్ సూర్య




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రజా ఉద్యమ కెరటం "సిపిఐ" తిరుపతి అని 41వ డివిజన్ కార్పోరేటర్ సూర్యతో పాటుగా పలువురు నాయకులు ప్రశంసించారు. ఈ మేరకు గురువారం ప్రజా ఉద్యమ నాయకుడు, మాజీ కౌన్సిలర్ మార్కపురి తిరుపతి 10వ వర్ధంతి సభ స్థానిక ఎల్బీనగర్ లోని సీపీఐ జెండా వద్ద శాఖ కార్యదర్శి, కార్పోరేటర్ మార్కపురి సూర్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె. కనకరాజ్ తదితరులు పాల్గొని తిరుపతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ......తిరుపతి తన ఇంటి పేరునే సీపీఐగా మార్చుకుని, కౌన్సిలర్‌గా గెలిచి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడారని కొనియాడారు. రామగుండం కార్పొరేషన్ ప్రాంతంలో ప్రజా ఉద్యమాల ద్వారా ఆయన తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎల్బీనగర్ లో నిర్మించబోయే 'సీపీఐ తిరుపతి స్మారక భవన్' ప్రజా పోరాటాలకు నిలయంగా మారాలని, దీని నిర్మాణానికి పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా 41వ డివిజన్ కార్పొరేటర్ గా గెలిచిన సూర్యను వారు అభినందిస్తూ, సీపీఐని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నివాళి కార్యక్రమంలో పార్టీ నాయకులు రేణిగుంట్ల ప్రీతం, పడాల కనకరాజు, జీడుల లక్ష్మీనారాయణ, మార్కపురి భగత్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లో అప్రకటిత 'చెత్త' అత్యవసర స్థితి: అధికారుల నిర్లక్ష్యంపై

# ఆకుల సతీష్ నిప్పులు!

● డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన 2000 టన్నుల చెత్త.. కంపు కొడుతున్న నగరం.● కాంట్రాక్ట్ ముగిసినా కొత్త టెండర్లు ఏవి? డిప్యూటీ కమిషనర్ తీరుపై విమర్శలు. ● జగద్గిరిగుట్ట తరహాలో కంప్రెసింగ్ కంటైనర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్.







**నిజాంపేట్, ఫిబ్రవరి 26, (వార్తాప్రభ) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని బిజెపి నేత ఆకుల సతీష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన జగద్గిరిగుట్టలోని జీహెచ్ఎంసీ డంపింగ్ సాటిలైట్ ట్రాన్స్‌పోర్టేషన్ సెంటర్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న చెత్త తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నిజాంపేట్ డంపింగ్ యార్డ్ సమస్యపై అధికారుల తీరును ఎండగట్టారు.

**2000 టన్నుల చెత్త.. రోడ్లపైనే పిహసీలు!** ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ.. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన గారు చెత్త నిర్వహణలో కఠినంగా వ్యవహరిస్తుంటే, నిజాంపేట్ అధికారులు మాత్రం మొద్దునిద్ర పోతున్నారని విమర్శించారు. లిటెండర్ల జాప్యం:లి పాత కాంట్రాక్టర్ శివశక్తి ట్రేడర్స్ గడువు ముగిసి 15 రోజులు కావస్తున్నా, కొత్త కాంట్రాక్టర్‌ను ఎంపిక చేయకపోవడం అధికారుల అసమర్థతకు నిదర్శనం. లివిజిలెన్స్ విచారణ ఉన్నా చెల్లింపులు:లి వివాదాస్పద పాత కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేయవద్దని సూచనలు ఉన్నా, డిప్యూటీ కమిషనర్ నిధులు విడుదల చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. లిస్తంభించిన రవాణా:లి రోజుకు 150 టన్నుల చెత్త వస్తుంటే, ప్రస్తుతం యార్డ్‌లో 2000 టన్నుల చెత్త పేరుకుపోయింది. దీంతో చెత్త ఆటోలు రోడ్లపైనే చెత్త వేయాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు.

**జగద్గిరిగుట్ట నమూనా కావాలి!** నిజాంపేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జగద్గిరిగుట్టలో ఉన్నట్లుగా కంప్రెసింగ్ కంటైనర్ సిలిండర్స్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనివల్ల రవాణా సులభం కావడమే కాకుండా కాలుష్యం తగ్గుతుందని సూచించారు. రోజుకు కనీసం 200 టన్నుల చెత్త తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని. హిటాచీల సహాయంతో ఆటోలు లోపలికి వెళ్లేలా దారి చేయాలని. విధుల్లో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ కమిషనర్‌పై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యపై త్వరలోనే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్రావు, ఈశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.


జగద్గిరిగుట్టలోని కంప్రెసర్ కంటైనర్లు

# హైదరాబాద్

## లోక కల్యాణార్థం యాగములు!!

● వైభవంగా సాయి మందిర 30వ వార్షికోత్సవం ● 108 పుణ్య దంపతులతో శ్రీ ఆంజనేయ స్వామి మహాయాగం ● ఘనంగా వార్షికోత్సవ కరపత్ర ఆవిష్కరణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి ● బాబా మందిర చైర్మన్ కన్నూరి సతీష్ కుమార్



**పెద్దపల్లి/ రామగుండం: ఫిబ్రవరి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం రైల్వే స్టేషన్ ప్రాంతంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిర 30వ వార్షికోత్సవ కరపత్రాన్ని గురువారం మందిర చైర్మన్ కన్నూరి సతీష్ కుమార్ భక్తుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....భక్తులు, దాతల సహకారంతో నిర్మితమైన ఈ ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ట జరిగి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మార్చి 11, 12 తేదీల్లో వార్షిక యాగ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 11న దేవతా స్థాపనలు, 12న 108 పుణ్య దంపతులతో శ్రీ ఆంజనేయ స్వామి మహాయాగం వంటి విశేష కార్యక్రమాలను వేద పండితుల నిర్ణయం మేరకు చేపట్టనున్నట్లు తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న ఈ వేడుకలకు భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై, ఈ మహోత్సవాలను విజయవంతం చేసి సాయినాథుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. నిత్యం మందిరాన్ని సందర్శిస్తూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేసిన ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాంపెల్లి శ్రీనివాస్ శర్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్య వైద్య శిబిరాలు.... ప్రజల రక్షణకు సూచికలు.


గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో... మెగా వైద్య శిబిరం
ఆటో యూనియన్ సేవలు శ్లాఘనీయం: మాజీ మేయర్ కావ్య.



**జవహర్ నగర్ ఫిబ్రవరి 26: (వార్తా ప్రభ)** ఆరోగ్య వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య రక్షణకు సూచికలని, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సేవలు శ్లాఘనీయ మనీ జవహర్ నగర్ మాజీ తొలి మేయర్ మేకల కావ్య అన్నారు. ఐకమత్యం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాంకీ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం మెగా మెడికల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ, పేదల నివాసానికి నిలయమైన జవహర్ నగర్ లో ఆరోగ్య శిబిరం నిర్వహించడం ముదా బావమన్నారు. జవహర్ నగర్ లో గరీబోల్లే ఎక్కువగా నివసిస్తున్నారని వారు కనీస అవసరాలకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారని, వారి ఆరోగ్య రక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మరిన్ని ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నేడు ప్రజలు ఎక్కువగా సరైన అవగాహన లేక క్యాన్సర్ బారిన పడుతున్నారని, క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించి వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు సరైన మోటివేషన్ కల్పించి ఆరోగ్య విషయాల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాంకి, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ తదితర సంస్థల కృషి అభినందనీయమన్నారు. జవహర్ నగర్ పరిధిలోని ప్రజలందరూ ఈ హెల్త్ క్యాంపును సద్వినియం చేసుకొని ఆరోగ్య జవహర్ నగర్ కై పాటుపడాలన్నారు. అనంతరం హెల్త్ క్యాంపులో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆలూరి సంగీత రాజశేఖర్,ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్లో ద్వితీయ స్థానంలో నిలిచిన మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్.

- పోలీస్ క్రీడాకారులను అభినందించిన సిపి అవినాష్ మహంతి.




**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 26)**:మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ క్రీడాకారులు తెలంగాణ స్టేట్ 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్లో విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 81 పతకాలు (23 బంగారు, 35 రజత, 23 కాంస్య) సాధించారు. ఓవర్ ఆల్ మెడల్ పట్టికలో ద్వితీయ స్థానం దక్కించుకుని కమిషనరేట్ గర్వకారణంగా నిలిచింది. గత వారం రోజులుగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ పోటీల్లో మల్కాజిగిరి పోలీసు సిబ్బంది వివిధ క్రీడా విభాగాల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా సీపీ అవినాష్ మహంతి విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, గెలుపు--ఓటములు సహజమని, విజేతలు జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ చూపాలని సిపి సూచించారు

# ఎడిటోరియల్

## ముద్రగడ మ్యాజిక్ పనిచేయడం లేదా ?

ముద్రగడ పద్మనాభం. అలియాస్ పద్మనాభరెడ్డి. ఆయన వైసీపీలో కీలక నాయకుడిగా ప్రస్తుతం ఉన్నారు. ఆయన 2024 ఎన్నికల ముందు ఒక భీకరమైన శపథం చేశారు. తాను జనసేన అధినేత పవన్ ని పిఠాపురంలో ఓడిస్తాను అని. ఒకవేళ అది సాధ్యపడకపోతే తన పేరు మార్చుకుంటాను అని. నిజానికి ఈ సవాల్ ఆయన తానుగా చేశారు, ఎవరూ చేయమనలేదు, ఆవేశంతో చేసిన ఈ సవాల్ ని ఆ తరువాత ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు కూడా. కానీ ముద్రగడ మాత్రం పట్టుదలగా తన పేరుని మార్చేసుకున్నారు. ముద్రగడకు అదే బూమరాంగ్ అయింది అని అంటున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనం స్పష్టంగా ఉంది. పైగా పవన్ కళ్యాణ్ ని గెలిపించాలని పిఠాపురం జనాలు డిసైడ్ అయ్యారు. ఇవన్నీ రాజకీయంగా విశేష అనుభవం కలిగిన ముద్రగడకు తెలియవా అన్నది పెద్ద ప్రశ్న. ఇక ఆయన తొలుత జనసేనలో చేరాలని అనుకున్నారని ఆ తరువాత అడుగులు వైసీపీ వైపు పడ్డాయని మరో ప్రచారం సాగింది. ఇక వైసీపీలో ఉంటూ ముద్రగడ పవన్ మీదనే రాజకీయ యుద్ధం ప్రకటించడం కాపు సామాజిక వర్గానికి నచ్చలేదని అంటారు. దాంతో నాటి నుంచే ముద్రగడ పట్ల కాపులు కొంత ఎడం పాటిస్తున్నారు అని అంటున్నారు ఇదిలా ఉంటే ముద్రగడ కాపుల గురించి ఏమి మాట్లాడినా గతంలో ఆయనకు మద్దతు ఉండేది. కానీ ఇపుడు మాత్రం ఆయన మాటలు చేస్తున్న ప్రకటనలు అన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చేస్తున్నది కూడా ఒక బలమైన సామాజిక వర్గంగా ఉన్న కాపులే అని అంటున్నారు. తాజాగా ముద్రగడ అంబటి రాంబాబుని పరామర్శించడానికి ఇంటికి వెళ్ళారు. ఆ తరువాత మీడియాతో మాట్లాడుతూ ఆయన కాపుల మీద టీడీపీ దాడులు అదే పనిగా చేస్తోంది అని విమర్శించారు. ఎపుడు అధికారంలోకి టీడీపీ వచ్చినా కూడా ఇదే విధంగా చేస్తున్నారు అని 2016లో తనను 2026లో అంబటి రాంబాబుని ఇలా దాడులు చేసి కుటుంబాల మీదకు వచ్చారని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. సహజంగా ముద్రగడ మాట్లాడితే కాపు సామాజిక వర్గం నుంచి పెద్ద ఎత్తున సానుకూల స్పందన రావాలి. కానీ ఆయన కామెంట్స్ ని సొంత వారే వైరల్ చేసి ట్రోల్ చేస్తున్నారు. దానికి కారణం పెద్దాయనగా ఉన్న ముద్రగడ నిలకడ లేని రాజకీయం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇక ఆయన పేరుని పద్మనాభరెడ్డి అని మార్చుకోవడం కూడా ఎవరికీ అసలు నచ్చడం లేదుట. దాంతో వైసీపీ నేతగానే ముద్రగడను చూస్తున్నారు తప్ప కాపుల కోసం ఉద్యమించిన గత ముద్రగడగా భావించడం లేదుట. దాంతో పెద్దాయన మ్యాజిక్ గోదావరి జిల్లాలో పెద్దగా పనిచేయడం లేదని అంటున్నారు. మరి ముద్రగడ ఈ విషయాల మీద విశ్లేషణ చేసుకుని బలమైన సామాజిక వర్గాన్ని ఆకట్టుకునేలా తిరిగి తన వ్యూహాలను అమలు చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

## ఏలూరు జిల్లాలో సభ్యత్వ నమోదులో కైకలూరు ముందంజలో ఉండాలి- కొల్లి బాబి.




**కైకలూరు ఫిబ్రవరి 26 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కైకలూరులో ఈరోజు జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు కొల్లి బాబి మాట్లాడుతూ, ఏలూరు జిల్లాలో జరుగుతున్న జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గం ముందంజలో నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియను అత్యంత బాధ్యతగా తీసుకుని గడువు లోపు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈరోజు నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు నిర్వహించబడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి జిల్లాలో కైకలూరును అగ్రస్థానంలో నిలపాలని ఆయన కోరారు. సభ్యత్వాన్ని సాధారణ ప్రక్రియగా కాకుండా కార్యకర్తల భద్రతకు రక్షణ కవచంగా భావించి పని చేయాలని అన్నారు. అలాగే పార్టీ ఎన్నికల గుర్తైన "గాజు గ్లాస్"ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి ఇంటికీ ఆ గుర్తు సులభంగా గుర్తుండేలా చైతన్యం కల్పించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కొనసాగుతున్న ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ ప్రతిష్టను మరింతగా పెంచుతుందని కొల్లి బాబి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పర్.. తప్పిన ప్రమాదం

**తాడిపత్రి ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పెద్దపప్పూరులోని సుబ్రహ్మణ్యం హోటల్ వద్ద గురువారం ఒక టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది కిందపడి విరిగిపోయింది. ఈ ప్రమాదంలో విద్యుత్ వైర్లు కూడా తెగిపోయాయి. అదృష్టవశాత్తూ, ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో జనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## తాతయ్య ప్రబోధం



సొంతమగును ఆనందము
మనసునే జయిస్తే
వారే వారే విజేతలు
బద్ధకాన్ని ఒడిస్తే
కోకొల్లలు ఫలితాలు
చురుకుదనమే ఓ వరము
కల్గియుంటే అద్భుతము
నిజముగా మలుపు తిరుగును
మారిపోవును జీవితము
చేయాలోయ్! సాహసము
ఉండాలోయ్! పోరాటము
చరిత్ర తిరిగి రాయొచ్చు!
అద్భుతాలే చేయొచ్చు!

శరీరమే శ్రమిస్తే
అత్యంత ఆరోగ్యము
మనసును నియంత్రిస్తే

-గద్వాల సోమన్న,
గణితోపాధ్యాయుడు
, ఎమ్మిగనూరు, సెల్:9966414580

# పాలక ప్రభుత్వాలు మహిళా సాధికారతపై దృష్టి సారించాలి

-అక్కినేని వనజ..





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజం లో సగభాగం ఉన్న దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళల కు సంపూర్ణ సాధికారత ఇచ్చేవిషయం లో చిత్తశుద్ధి ప్రదర్శించాలని భారత జాతీయ మహిళా సమాఖ్యఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ నాయకురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ లోని దాసరి నాగ భూషణ రావు భవన్ లో ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్యఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ రాష్ట్ర సమితి సమావేశం మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరైన వనజ మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలు ప్రజల హక్కులను, రాష్ట్ర అభివృద్ధిని, రైతుల భవిష్యత్తును, సామాన్యుల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నా యన్నారు. ఈ విధానాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంద న్నారు. సీడ్ బిల్-2025 వంటి చట్టాలు రైతుల హక్కులను హరిస్తూ, బీజ సంస్థలకు, కార్పొరేట్ కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టేలా రూపొందించబడ్డాయనీరాష్ట్రాలకు న్యాయమైన ఆర్థిక వనరులు, నిధులు కేటాయించకపోవడం, దక్షిణ రాష్ట్రాలను వివక్ష చూపడం కొనసాగుతోందన్నారు. మత విద్వేషాన్ని రెచ్చగొట్టడం, భాషా బలవంతం, రాజ్యాంగ విరుద్ధ చర్యలు, రాష్ట్రాల స్వయం పరిపాలన హక్కులను హరించే ప్రయత్నాలు ఆందోళన లు కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్రం లో అధికారం లో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా వ్యతిరేక విధానాల ను అవలంభిస్తుందని విమర్శించారు. మహిళా రక్షణ భద్రత పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదని ఇటీవల కాలంలో మహిళలు చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు ఆవేదనను కలిగిస్తున్నాయని , మహిళల స్వేచ్ఛ,సమానత్వం, సాధికారత మాటలకే పరిమితమయ్యాయని , మహిళలకు సంపూర్ణ సాధికారత కల్పించే విషయం లో పాలకులు నిర్లక్ష్యం వీడమదాలని అన్నారు. రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ధనవంతులకు అనుకూలంగా, పేదవారికి పెను భారంగా మారాయని విమర్శించారు. దేశం లో 80 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నారని చెప్పడానికి నిదర్శనం 80 శాతం ప్రజలు రేషన్ కార్డు హోల్డర్స్ గా ఉండటాన్ని బట్టి తెలుస్తుందని అన్నారు.. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు మహిళను కుంగదిస్తుంటే ,మరోవైపు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు జీవించే హక్కును కూడా హరించేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు సక్రమ అమలుకు నోచుకోవడం లేదన్నారు. రాబోయే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత జాతీయ మహిళా సమాఖ్యఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ పిలుపులో భాగంగా మహిళపై జరుగుతున్న హింసను నిరసిస్తూ,శాంతి, సమానత్వం ను కోరుతూ ,న్యాయాన్ని పరిరక్షేందుకై ఐక్యంగా ఉద్యమించాలని కోరుతూ కార్యక్రమాలు నిర్వహించాలనీ గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద కేంద్ర ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవాలని,పాలక ప్రభుత్వాలు తమ ఎన్నికల వాగ్దాలను నిలబెట్టుకుని సక్రమంగా అమలుచేయాలని కోరుతూ కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయం జరిగిందన్నారు. విద్యాలయాలను కలుషితం చేస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్న ఆర్ ఎస్ ఎస్, సంఘ పరివార్ శక్తుల అరాచకాలను నిరసిస్తూ , ఆంధ్ర యూనివర్సిటీ లో వామపక్ష విద్యార్ధి సంఘాల నాయకులపై దాడులను ఖండిస్తూ సమావేశం లో తీర్మానాలు చేయడం జరిగింది. ఈ సమావేశం లో రాష్ట్ర మహిళా సమాఖ్య నాయకులు అన్నగిరి పద్మావతి,పంచదార్ల దుర్గాంబ,వి .జయలక్ష్మి, బి.నదియా,మన్నవ యామిని మరియు రాష్ట్ర మహిళా సమాఖ్య సమితి సభ్యులు పాల్గొన్నారు.

# కేబీఎన్ కళాశాల ఆవరణలో రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభం





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ కేబీఎన్ కళాశాలలో సెంటర్ ఫర్ రోబోటిక్స్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్- ల్యాబ్‌ను ప్రారంభించారు. ఏపీ సైన్సు సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రం నెలకొల్పినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జి.కృష్ణవేణి వివరించారు. ప్రపంచం అంతా ఇప్పుడు రోటిక్స్ మీద నడుస్తోందని- విద్యార్థులకు ఈ దిశగా శిక్షణ ఇచ్చేందుకు- ఈ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక రోబోని ఏలా తయారు చేయాలి? ఏయే అవసరాల కోసం వాటిని ఎలా వినియోగించవచ్చు? బోధన అంశాల్లో రోబో ఎలా సహకరిస్తుంది? ఆసుపత్రుల్లో రోగులకు రోబో ద్వారా అందే సేవలు ఎలా ఉంటాయి? వంటి అంశాలపై అవగాహన కలిగించడంతోపాటు వీటి తయారీ కేంద్రాలు నెలకొల్పేందుకు యువతలో ఆసక్తిని కలిగించడం తమ ఉద్దేశ్యంగా ఉందని పేర్కొన్నారు. రోబోటిక్స్‌లో విద్యార్థులను ఓ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దేందుకు కావాల్సిన శిక్షణ, అవగాహన ఇప్పించేలా తమవంతు చొరవ చూపుతామన్నారు.

**త్వరలో కేబీఎన్ కళాశాలతో ఒప్పందం: ఏపీ సైన్స్ సిటీ సీఈఓ** కేబీఎన్ కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ చాలా అద్భుతంగా ఉందని- అలాగే కళాశాలలోని వివిధ ల్యాబ్‌లలో 1990ల కాలం నాటి వస్తువుల నుంచి నేటి ఆధునిక సాంకేతికత వరకు అన్నింటినీ చాలా చక్కగా నిర్వహిస్తున్నారని ఏపీ సైన్స్ సిటీ సీఈఓ కేశినేని వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కళాశాలలో 60 శాతం ప్రాధాన్యం ల్యాబ్ ప్రాక్టికల్స్‌కు, 40 శాతం థియరీ క్లాసులకు ఇవ్వడం చాలా సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా రోబోటిక్స్ వైపు వెళ్తోందని, విద్యార్థులే స్వయంగా హ్యూమనాయిడ్ రోబోలను తయారు చేసేలా ఇక్కడ శిక్షణ ఇవ్వాలనుకోవడం గొప్ప విషయమని అన్నారు. తద్వారా విద్యార్థులు కేవలం నేర్చుకోవడమే కాకుండా, రోబోలను తయారు చేసి విక్రయించే వ్యవస్థాపకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా ఈ ల్యాబ్ సౌకర్యాలు అందేలా కె.బి.ఎన్. కళాశాలతో త్వరలోనే ఒక ఎం.ఓ.యు. కుదుర్చుకోనున్నట్లు సీఈఓ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించిన స్వర్ణాంధ్ర విజన్ 2047.. "వికసిత భారత్" లక్ష్యాలలో భాగంగా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని, సృజనాత్మకతను పెంపొందించడమే తమ సైన్స్ సిటీ ముఖ్య ఉద్దేశమని వివరించారు.

**నేడు చిట్టూరి హైస్కూల్‌లో సైన్స్‌డే కార్యక్రమం** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడ చిట్టూరి హైస్కూల్‌లో జాతీయ సైన్స్‌డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,500 పాఠశాలల నుంచి 30 వేల విద్యార్థులతో ఒకే సమయంలో సైన్స్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ భారీ కార్యక్రమాన్ని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్- ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పరిశీలిస్తున్నారని వెల్లడించారు.

**ఈట్-సేఫ్ యాప్ ఆవిష్కరణ** కళాశాల విద్యార్థులు రూపొందించిన ఈట్-సేవ్ యాప్‌ను సైన్స్ సిటీ సీఈఓ వెంకటేశ్లర్లు ఆవిష్కరించారు. మనం ఆహారంగా తీసుకునే పండ్లు, ఇతర పదార్థాలు ఎంతవరకు సురక్షితమైనవో తెలుసుకోవడానికి, ఆహార కల్తీపై అవగాహన పెంచడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులు పేర్కొన్నారు.


# క్రమ తప్పకుండా ప్రతిరోజు త్రాగు నీటి పరీక్షలు ఖచ్చితంగా నిర్వహించాలి

### విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్రమ తప్పకుండా ప్రతిరోజు నీటి పరీక్షలు ఖచ్చితంగా నిర్వహించాలని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి అన్నారు. గురువారం ఉదయం ఇంజనీరింగ్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్సో ఎమినిటీ సెక్రటరీలు, అసిస్టెంట్ ఇంజనీర్లు ప్రతిరోజు తమ తమ వార్డుల్లో తమ తమ సెక్రటేరియట్ పరిధుల్లో నీటి పరీక్షలు కచ్చితంగా నిర్వహించి శుద్ధమైన త్రాగునీరు అందుతుందా లేదా అని నిర్ధారించుకోవాలని అన్నారు. ఎక్కడైనా త్రాగునీరు కలిసితం అవుతుందన్న సందేహం ఉన్న వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించి కేవలం శుద్ధమైన త్రాగునీరే ప్రజలకు అందేటట్టు ఖచ్చితమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు డెప్యూటీ ఇంజనీర్లు క్రమ తప్పకుండా నిర్ణీత సమయాల్లో వాటర్ ట్యాంకులు కడగటం, స్కవరింగ్ లు చేసేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. మరోవైపు నగరంలో నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులు ఎప్పటికప్పుడు చేస్తూనే ఉండాలని, కాలువల ప్రవాహంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న వేసవి కాల దృశ్య తమ తమ పరిధిలో వారు తీసుకుంటున్న చర్యలపై ఒక ప్రణాళికను సిద్ధం చేసి త్రాగునీటిలో ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా చేయుటకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేశారు వంటి విషయాలపై నివేదికను సమర్పించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

# ఆదురుపల్లిలో వాహనాలు తనిఖీలు

### హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు: చేజర్ల ఎస్సై జె.తిరుమలరావు



**చేజర్ల ఫిబ్రవరి 26 (వార్తాప్రభ)** నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలోని ఆదురుపల్లి బస్టాండు సమీపంలో గురువారం చేజర్ల ఎస్సై జె.తిరుమలరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ ఆర్‌సీ బుక్ ఇన్సూరెన్స్ పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలకు చలానాలు విధించి హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతి ఒక్క వాహనదారులు విధిగా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ వాహనాల తనిఖీలలో చేజర్ల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతులపాటి భౌతిక కాయానికి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) నివాళి

### నూతులపాటి మరణం టిడిపికి తీరని లోటు : ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , టి.ఎన్.ఎస్.ఎఫ్ ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి ఎంపీ కేశినేని శివనాథ్ టిడిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. పటమటలంక లోని బృందావన్ అపార్ట్మెంట్స్ లో నూతులపాటి నాగభూషణం భౌతిక కాయానికి గరువారం ఉదయం ఎంపీ కేశినేని శివనాథ్ సందర్శించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకురాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాగభూషణం పార్టీ కి చేసిన సేవలను గుర్తు చేశారు. పార్టీ అండగా వుంటుందని కుటుంబ సభ్యులకి భరోసా ఇచ్చారు. నూతులపాటి నాగభూషణంకు నివాళు లర్పించిన వారిలో ఏపీ బిల్డింగ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జా అజేయ్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి లతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏ పి ఎస్ ఆర్టీసీ ఎమ్ డి ని మర్యాద పూర్వకంగా కలిసిన అసోషియేషన్ నాయకులు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపి పి.టి.డి (ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్సీ.శేషగిరిరావు ఆధ్వర్యంలో ఏపీ పి.టి.డి కమిషనర్ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండి గా పదవి బాధ్యతలు చేపట్టిన సీఎం ఎన్. బాలసుబ్రమణ్యం (ఐ.పీ.ఎస్) ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగం ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ హయ్యర్ పెన్షన్ కానీ లేదా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సి.పి.ఎస్) కానీ తీసుకోవడానికి అవకాశం కల్పించడం సుమారు మూడు వేల టీటీడీ ఉద్యోగులు సిపిఎస్ ను ఆప్షన్ ఇచ్చారు. వారికి 9 నెలలుగా సిపిఎస్ లో ఉద్యోగి వాటా చెల్లిస్తున్నారు. గతంలో పీఎఫ్ లో ఉద్యోగుల వాటాల సంబంధించిన సొమ్మును వారు ఉద్యోగులకు చెల్లించలేదనీ, ఉద్యోగులు పిఎఫ్ సొమ్మును ఇప్పించవలసిందిగా వారికి వినతిపత్రం అందజేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈ కృష్ణారావు, సభ్యులు టీ. సూరిబాబు, డి ఎస్ సాగర్, పి వెంకటేశ్వరరావు, టీ. భరణి, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలంలో లెజిస్టేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ జరగాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్ష

## ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ - 2026 కి ముఖ్యఅతిథిగా హాజరు

### స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసలు

### లెజిస్లేటివ్ సౌత్ ఇండియా ప్రీమియర్ లీగ్ కు స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన

### వైజాగ్ స్టేడియంలో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామన్న ఎంపీ కేశినేని శివనాథ్





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సౌత్ ఇండియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్, అసెంబ్లీ ఎమ్మెల్యేలతో క్రికెట్ పోటీలు నిర్వహించాలనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచనను ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశంసించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆలోచన రాబోయే కాలంలో లెజిస్టేటివ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు పునాది కావాలని ఆకాంక్షించారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ స్టేట్ లేజిస్టేటివ్ స్పోర్ట్స్ మీట్ -2026 కి ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం హాజరై క్రీడలు ఆడుతున్న ప్రజాప్రతినిధులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాబోయే ఏడాది లెజిస్లేటివ్ సౌత్ ఇండియా ప్రీమియర్ లీగ్ కు వైజాగ్ స్టేడియం వేదిక కాబోతున్నందుకు ఆనందంగా వుందన్నారు. వీటిని ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ స్పోర్ట్స్ మీట్ ప్రజాప్రతినిధుల మధ్య ఐక్యత, ఫిట్‌నెస్, క్రీడా స్ఫూర్తి పెంపొందిస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజవర్గ బాధ్యతలతో పాటు , స్పోర్ట్స్‌లో కూడా యాక్టివ్ గా పాల్గొనటాన్ని అభినందించారు. ఆల్ రౌండర్ ప్రతిభ చూపుతున్న హోం మంత్రి అనిత ను ప్రత్యేకంగా కొనియాడారు. అలాగే ఇప్పటి కి ఫిట్ నెస్ తో వుంటూ యువకులలా కనిపించే ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్ లను అభినందించారు.

## మంచానికే పరిమితమైన యువకుడికి సహాయం మంచి మనసు చాటుకున్న కోటప్రోలు కృష్ణ



**ముదినేపల్లి ఫిబ్రవరి 26 (వార్తా ప్రభ)** గురజా గ్రామానికి చెందిన గొంతు పుల్లి వంశీ (24) ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. గత ఏడాది ఆగస్టు 17వ తేదీన కావలిలో రైల్లో ప్రయాణిస్తూ ఉండగా కాలుజారి పడిపోవడంతో ఆయన తలకు బలమైన గాయం అయింది. అక్కడి స్థానిక పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, తల గాయం కారణంగా వెన్నుపూసలో నరాలు దెబ్బతిని పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు.వంశీకి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఒకరికి నాలుగేళ్లు, మరొకరికి మూడు నెలలు మాత్రమే. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయం తెలుసుకున్న "మేము సైతం మీకోసం మేమున్నాం" టీం సభ్యులు బాధితుడిని కోటప్రోలు కృష్ణ వద్దకు తీసుకెళ్లగా, ఆయన తన వంతు సహాయంగా ఒక నెలకు సరిపడిన నిత్యావసర సరుకులు అందించారు. అంతేకాకుండా బాధితుడికి ప్రభుత్వం తరఫున అందే పెన్షన్ మంజూరు అయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోటప్రోలు కృష్ణతో పాటు మొవ్వ ఫణింద్ర కోటేశ్వరరావు (ఫణి) మరియు మరికొంతమంది పాల్గొన్నారు.స్థానికులు కోటప్రోలు కృష్ణ చేసిన సేవను అభినందిస్తూ, ఇలాంటి సేవాభావం మరెంతో మందికి ఆదర్శమని పేర్కొన్నారు.

## వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామివారి 38వ వార్షికోత్సవం...



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన దత్తత దేవస్థానం అయిన రెడ్డిపాలెంలో వేంచేసియున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి 38వ వార్షికోత్సవ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామత అభిషేకం, నాగవల్లి (తమలపాకులు)లతో అర్చన, నీరాజన మంత్రపుష్పములు, స్వామివారి శాంతి కళ్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు, వి.క్యూబ్ పౌండేషన్ అధినేత పామర్తి వీర రాఘవులు తదితర భక్తులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్తల భద్రతే పార్టీ కర్తవ్యం నల్లగోపుల వెంకట చలపతి.




**కలిదిండి ఫిబ్రవరి 26 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా,కైకలూరు నియోజకవర్గం కైకలూరులో ఈరోజు జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ శాఖ డైరెక్టర్ జనసేన నాయకులు నల్ల గోపుల వెంకట చలపతి మాట్లాడుతూ, కార్యకర్తల భద్రతే పార్టీ ప్రధాన లక్ష్యం, ఉద్దేశమని స్పష్టం చేశారు. అందుకే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని, దీనిని సాధారణ సభ్యత్వంగా కాకుండా కార్యకర్తలకు రక్షణ కవచంగా చూడాలని సూచించారు.ఈరోజు నుండి ప్రారంభమైన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఇంతకు ముందు కంటే ఎక్కువ స్థాయిలో చేపట్టి గుర్తింపు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఒక్కో జనసేన కార్యకర్త కనీసం 400 సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయడం ద్వారా పార్టీని బలోపేతం చేయవచ్చని తెలిపారు.నెంబర్‌షిప్ డ్రైవ్‌ను శక్తివంతంగా ముందుకు తీసుకెళ్తే రాబోయే కాలంలో కైకలూరులో నుండి జనసేన తరఫున పోటీ చేసే అవకాశాలు కూడా మెరుగవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఏలూరు జిల్లాలో సభ్యత్వ నమోదులో కైకలూరు నియోజకవర్గం ముందు వరుసలో నిలవాలని, ఆ దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని సూచించారు.క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ ప్రతిష్టను మరింతగా పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని నాయకులు తెలిపారు.

## జి.కొండూరు లో ఇంటి పన్నులు వసూళ్ళు వేగవంతం

**గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి షాప్ లైసెన్సు ఫీజులు కట్టిస్తున్న సెక్రటరీ ఏటుకూరి**



**జి.కొండూరు :ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా,జి .కొండూరు గ్రామం లో ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి ఏటుకూరి బసవలింగేశ్వరరావు ఇంటి పన్నులు వసూళ్ళ ను వేగవంతం చేశారు.గ్రామ సచివాలయం, గ్రామ పంచాయితీ సిబ్బందితో కలిసి సెక్రటరీ స్వయంగా ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను వసూళ్ల తో పాటు గ్రామంలోని వివిధ షాపుల లైసెన్స్ ఫీజులను కట్టించే పనిలో నిమగ్నమయ్యారు. ఇంటి పనులు త్వరితగతిన చెల్లించాలని ఇంటి యజమానులను కోరారు.

# దళిత, బీసీ నాయకత్వంలో రామగుండం ప్రగతి పథం!!

- పార్టీలకతీతంగా అభివృద్ధి
- రామగుండం నగర పునర్నిర్మాణమే మా లక్ష్యం
- మేయర్ మహంకాళి స్వామికి శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 26 (వార్తాప్రభ ప్రతినిధి)**దళిత, బీసీ నాయకత్వంలో రామగుండం ప్రగతి పథంలో నడిపించడం తమ ధ్యేయమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు గురువారం రామగుండం నగరపాలక సంస్థ మేయర్‌గా మహంకాళి స్వామి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దంపతులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....... అధికార, ప్రతిపక్షాలనే భేదం లేకుండా అన్ని డివిజన్లలో అందరి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుండి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న దళిత నాయకుడు మేయర్ కావాలని, అలాగే సీనియర్ బీసీ నాయకుడు డిప్యూటీ మేయర్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు ఆశీస్సులతో ఎంపికయ్యారని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన రామగుండం నగరాన్ని పునర్నిర్మించే సంకల్పంతో తాము ముందుకు సాగుతున్నామని, దుష్ప్రచారాన్ని నమ్మకుండా ప్రజలు తమకు అద్భుత మద్దతు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. మౌలిక వసతులు, త్రాగునీరు, సాగునీటి ప్రాజెక్టుల కోసం కోట్లాది రూపాయల నిధులు వెచ్చించడంతో పాటు, 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు వంటి పరిశ్రమలతో పారిశ్రామిక ప్రగతి వేగంగా సాగుతోందని వెల్లడించారు. సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి నూతన పాలక వర్గం చిత్తశుద్ధితో పనిచేయాలని రాజ్ ఠాకూర్ ఈ సందర్భంగా సూచించారు.

## కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ స్పందనతో
# తొలగిన ప్రమాద పరిస్థితి

- వంగినవిద్యుత్ స్తంభాలను, కరెంటు తీగలను తక్షణమే మార్చిన విద్యుత్ శాఖ అధికారులు
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు.

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 26 (వార్తా ప్రభ):** వర్షాల ప్రభావంతో గంగారం గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వంగి,తీగలు దిగువకు వేలాడుతూ ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. గాలి,వాన తీవ్రత పెరిగితే ఎప్పుడైనా అపాయం సంభవించే పరిస్థితి ఉండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ సమస్యపై కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ గౌడ్ విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు.వెంటనే స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.వంగిన స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ప్రతిష్ఠించడంతో పాటు, దెబ్బతిన్న విద్యుత్ తీగలను మార్చి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేశారు. సహాయ ఇంజినీరు హుస్సేన్ ఆధ్వర్యంలో లైన్మెన్ రాజు, సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.ప్రమాదకర పరిస్థితులు తొలగించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దొంతి శేఖర్ ముదిరాజ్, పరిశీలించారు.





## 'తమిళ గాంధీ' నల్లకన్ను మృతి అట్టడుగు వర్గాలకు తీరని లోటు: సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

- 101 ఏళ్ల పోరాట యోధుడికి షాపూర్ నగర్ సిపిఐ కార్యాలయంలో ఘన నివాళులు.
- మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థుల కోసం దానం చేసిన మహనీయుడు.
- స్టాలిన్, కరుణానిధి వంటి హేమాహేమీలు గౌరవించిన గొప్ప వ్యక్తిత్వం.





**కుత్బుల్లాపూర్/షాపూర్ నగర్, ఫిబ్రవరి 26, (వార్తాప్రభ) :**ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, 101 ఏళ్ల వయస్సులో కన్నుమూసిన 'తమిళ గాంధీ' నల్లకన్ను మరణం దేశంలోని అట్టడుగు వర్గాల వారికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ మండల సిపిఐ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.


**ఏడు సంవత్సరాల జైలు శిక్ష.. నిరంతర ప్రజా పోరాటం** మండల కార్యదర్శి కె. స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉమా మహేష్ మాట్లాడుతూ నల్లకన్ను జీవిత ప్రస్థానాన్ని కొనియాడారు. 1925లో జన్మించిన ఆయన, 17 ఏళ్ల ప్రాయంలోనే సిపిఐ సభ్యత్వం తీసుకున్నారని. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని సుమారు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారని. ఆయన నిరాడంబరత, అంకితభావాన్ని చూసి తమిళ ప్రజలు ఆయన్ని ప్రేమతో 'తమిళ గాంధీ' అని పిలుచుకునేవారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నల్లకన్నును 'తన కన్ను'గా అభివర్ణించేవారని, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ పదవీ బాధ్యతలు చేపట్టాక ఆయన ఆశీస్సులు తీసుకున్నారని తెలిపారు.

**మరణాంతరం కూడా సమాజ సేవ** నల్లకన్ను జీవించినప్పుడే కాకుండా, మరణించాక కూడా తన శరీరాన్ని వైద్య విద్యార్థుల శిక్షణ కోసం ప్రభుత్వ మెడికల్ ఆసుపత్రికి దానం చేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం, సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ నివాళులర్పించిన వారిలో సహాయ కార్యదర్శులు వి. హరినాథ్ రావు, డి. రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, సంతోష్, నరసింహ రెడ్డి, మహేందర్, భీమేష్, గుర్రప్ప తదితరులు ఉన్నారు.

## రూ.1.6 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి మరింత వేగవంతం**

**కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, ఫిబ్రవరి 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నియోజకవర్గంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రూ.1.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం గురువారం శంకుస్థాపన చేశారు. మట్లచెరువు నుంచి బాపనయ్య చెరువు వరకు నిర్మించనున్న ప్రధాన సిసి రోడ్డుకు రూ.97.5 లక్షలు, నెలపర్తిపాడు గ్రామంలో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు రూ.9 లక్షలు కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలు సౌకర్యవంతం కావడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి.ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గత 20 నెలల కాలంలో సుమారు రూ.180 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పెంకే సాంబశివరావు, టేకుమూడి సత్యనారాయణ, పంచాయతీరాజ్ డిఈ శ్రీనివాస్, ఏ.ఈ. ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



## గాంధీనగర్ కాలనీవాసులు స్పీడ్ బ్రేకర్లు మరియు సిసి కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలి,

**న్యూ గాంధీనగర్ కాలనీ అధ్యక్షులు జి. నరేష్ కుమార్**



**కాప్రా, గాంధీనగర్, ఫిబ్రవరి 26:(వార్తా ప్రభ)**కాప్రా న్యూ గాంధీనగర్‌కాలనీలో ఇటీవల నిర్లక్ష్యంగా బైక్ నడపడం వల్ల ఒక చిన్న బాలుడు గాయపడ్డాడు. బాలుడి తలకు బలమైన గాయం అయింది.ఆ బాలుడిని కాప్రా న్యూ గాంధీనగర్ కాలనీ అధ్యక్షుడు జి. నరేష్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు.కాలనీలో సరైన స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం మరియు సీసీటీవీ కెమెరాలు లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని రాత్రి వేళల్లో కొందరు యువకులు మద్యం మత్తులో అతివేగంగా బైక్‌లు నడుపుతున్నారు. దీనివల్ల చిన్న పిల్లలు, పెద్దవారు ప్రమాదానికి గురవుతున్నారు.ఈ సమస్యలపై కాలనీ సభ్యులతో సమావేశం నిర్వహించి కాలనీ సమస్యల గురించి చర్చించికాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు.ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.పోలీసుల పర్యవేక్షణ పెంచేందుకు విజ్ఞప్తి చేయాలి.యువతకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలి. పిల్లల భద్రత కోసం కాలనీవాసులు అందరూ కలిసి చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని కాలనీ అధ్యక్షుడు నరేష్ కుమార్ అన్నారు.

## వెల్దండలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యేలు.



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 26)**:వెల్దండ మండలంలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి , అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మరియు కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి కలిసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.అనంతరం వంగూరు మండలం రంగాపూర్ వద్ద నూతనంగా నిర్మాణం చేసిన ఆలయాన్ని పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ, కల్వకుర్తి మండలాలు మరియు పట్టణాల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## అలైవ్ అరైవ్ లో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు.

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ డిసిపి డాక్టర్ అనురాధ.ఐపీఎస్.**



**ఎల్బీనగర్/వార్తప్రభ ( ఫిబ్రవరి 26)**:వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఆటోనగర్‌లో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ శిబిరంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ ఐపీఎస్,ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు,రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.శ్రీ నేత్రాలయ సహకారంతో పలువురు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.

## నియోజకవర్గంలో 2.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఎమ్మెల్యే బోడె ప్రసాద్**



**కంకిపాడు / పెనమలూరు ఫిబ్రవరి 26 (వార్త ప్రభ ప్రతినిధి)**పెనమలూరు నియోజకవర్గం, పెనమలూరు మండలంలో గోసాల, వణుకూరు, గంగూరు గ్రామాలలో సుమారు 2.50 లక్షల నిధులతో చేపట్టబోయే సిసి రోడ్ నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్ భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పటి నుంచో పెండింగ్లో ఉన్న గంగూరు, వేల్పూర్ కనెక్టివిటీ రోడ్డు, గతంలో గంగూరి వరకు అభివృద్ధి చేశాము, ఇప్పుడు వేల్పూర్ వరకు సుమారు 60 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గోసాల సాయిబాబా గుడి కట్ట రోడ్డు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని సుమారు 50లక్షల నిధులతో అభివృద్ధికి పనులు మొదలు పెడుతున్నామన్నారు. వణుకూరు లేఔట్ లో సుమారు 1.33 లక్షల నిధులతో రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గోసాల గ్రామంలో అభివృద్ధి వేగవంతంగా జరిగిందన్నారు. సంవత్సరంన్నర కాలములోని గ్రామంలో 4కోట్ల అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. త్వరలో బందర్ రోడ్డు నుంచి మద్దూరు వరకు నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెనమలూరు మండల అధ్యక్షులు కోయ ఆనంద్, తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, నియోజవర్గ బిసి సెల్ అధ్యక్షులు సంఘీపు రంగారావు, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఐదు వందల కోట్లకు పైగా ప్రభుత్వం కేటాయించింది

- బడ్జెట్ పై అవగాహన లేని వ్యాఖ్యలు చేసిన నాయకులు
- బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేణుగోపాలరావు



**పెడన,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాలలో చేనేత ప్రశ్నకు 500 కోట్ల రూపాయలకు పైగా కేటాయించిందని బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. బడ్జెట్ అనంతరం కొంతమంది నాయకులు అవగాహన లేని విశ్లేషణలు చేశారని తెలిపారు. గురువారం ఆయన స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ బడ్జెట్లో 115 కోట్లు కేటాయించడంతోపాటు అదంగా మరో నాలుగు వందల కోట్ల రూపాయలు సమకూరుస్తున్నారని తెలిపారు. చేనేతకు 200 యూనిట్లు పవర్ లూమ్ కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తును అందిస్తున్నారని వివరించారు. ఇందుకోసం బడ్జెట్లో 150 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ పరిశ్రమను ఆధారం చేసుకుని జీవిస్తున్న కార్మికులకు 250 కోట్లు రూపాయలు ఫైనాన్షియల్ అసిస్టెన్సీ ద్వారా అందిస్తున్నారని వివరించారు. అలాగే థ్రిఫ్ట్ ఫండ్ నిధులకోసం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సంబంధిత శాఖ మంత్రి తో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అమలు పరచిన నేతన్న నేస్తం పథకం కంటే పరిశ్రమ మనుగడ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి ముఖ్యం అన్నారు. ఎన్టీఆర్ భరోసా అందరికి అందేలా కృషి చేస్తున్నామని వేణుగోపాల్ రావు తెలిపారు. గత ప్రభుత్వ బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందని ఇందులో భాగంగానే థ్రిఫ్ట్ ఫండ్ బకాయిలను విడుదల చేశామని తెలిపారు ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య కూడా పాల్గొన్నారు

# పటిష్ట భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్ గోదాములు..

- ఈవీఎం, వీవీప్యాట్ గోదాము వద్ద నిరంతర పర్యవేక్షణ..
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించడం జరిగినప్పటికి నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అదేశించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో జిల్లా కలెక్టర్ తో పాటు డిప్యూటీ సీఈవో, ఈవీఎంల నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, కందుల పరమేశ్వరరావు (ఆమ్ ఆద్మీ పార్టీ), జె.శ్రీనివాసరావు (జనసేన), బి.కృష్ణారెడ్డి (బీజేపీ), సురేష్ సిపిఐ (ఎం), కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్ పి.సలీమ్, డిప్యూటి తహశీల్దార్ ఎ.ఎస్.ఆర్ గోపాల రెడ్డి తదితరులు ఉన్నారు.

# పాడి రైతు కుటుంబానికి కృష్ణా మిల్క్ యూనియన్ 50 వేలు ఆర్థిక సాయం


- పాల రైతులకు భరోసా "కృష్ణ క్షీర బంధు" పథకం
- వైసిపి నేత కొమ్మినేని రవిశంకర్



**నందిగామ,జనవరి 26 (వార్తాప్రభ) :** గురువారం మండల పరిధిలోని మాగల్లు గ్రామంలో ఇటీవల మరణించిన పాల రైతు శంకరశెట్టి కృష్ణారావు కు కృష్ణ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి " కృష్ణ క్షీర బంధు" పథకం ద్వారా ఆ కుటుంబానికి అండగా 50వేల రూపాయలు చెక్కు ను వైసీపీ నేత రవిశంకర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కొమ్మినేని రవిశంకర్ మాట్లాడుతూ కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశపెట్టిన" కృష్ణ క్షీర బంధు" పథకం కింద సంఘ పాల ఉత్పత్తిదారుడైన శంకర్ శెట్టి కృష్ణారావు మరణించడంతో ఆ కుటుంబానికి ఆపదలో ఆపన్న హస్తం లా నిలిచిందన్నారు. పాల రైతు కుటుంబాలకు తోడుగా మేమున్నామని భరోసా కల్పించడమే "కృష్ణ క్షీర బంధు" కృష్ణ మిల్క్ యూనియన్ ( విజయ డైరీ) వారి లక్ష్యమని రవిశంకర్ అన్నారు.అనంతరం కృష్ణ మిల్క్ యూనియన్ మేనేజర్ మాట్లాడుతూ కృష్ణ మిల్క్ యూనియన్ వారి విజయ డైరీ కి పాలు పోసే రైతు ఏ కారణం చేతనైనా మరణించిన శోకసముద్రంలో ఉన్న ఆ కుటుంబానికి యూనియన్ వారు 50,000 పరిహారం చెల్లించిందని అయితే ఆ రైతు మరణించిన తేదీ ముందు 365 రోజుల్లో కనీసం 180 రోజులు మరియు 108 లీటర్లు పాలు పోసి ఉండాలని దీనికోసం రైతు నుండి ఏ విధమైన ప్రీమియం చార్జీలు వసూలు చేయ రని తెలిపారు.2019 జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం వలన యూనియన్కు పాల రైతులకు మధ్య ఉన్న బంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.మాగల్లు గ్రామంలో పాల రైతు శంకర్ శెట్టి కృష్ణారావు కుటుంబానికి అండగా ఉన్నా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు, మేనేజర్,సూపర్వైజర్కు పాల ఉత్పత్తిదారుల సంఘం , రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# వైభవంగా సీతా రామ చంద్రమూర్తి స్వామి విగ్రహాల పునః ప్రతిష్ట

- ప్రాచీనతకు అద్దం పదడుతున్న ఆలయం -- రూ. 1.5 కోట్లతో నూతన నిర్మాణం



**అమలాపురం,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** సుమారు 240 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన సీతా రామ చంద్రమూర్తి స్వామి ఆలయం, సరికొత్త శోభను సంతరించుకుంది. కోటిన్నర రూపాయల వ్యయంతో అత్యంత సుందరంగా నిర్మించిన ఈ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్టా మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రిత్వికల ఆధ్వర్యంలో హోమం వివిధ ధార్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పేరూరి విజయ లక్ష్మి, మండేల బాబీ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈ.ఓ రాగోలు శ్రీనివాస్, విశ్రాంత ఈ.ఓ బొక్కా వెంకటేశ్వర రావు,బాలభక్త సంఘం అధ్యక్షులు కొత్తూరి శ్రీను ఈ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాచిరాజు లక్ష్మీ నారాయణ దంపతులు ప్రతిష్టా కార్యక్రమాల్లో ప్రధాన పాత్ర పోషించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోలాహలం మధ్య జరిగిన ఈ పునఃప్రతిష్టా కార్యక్రమం,గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది.

# గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలపై ఎమ్మెల్యే పంతం గళం



**కాకినాడ రూరల్,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గృహ నిర్మాణ లబ్దిదారుల సమస్యలను బలంగా ప్రస్తావించారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లబ్దిదారులకు పిఎంఎవై అర్బన్ 2.0 ద్వారా రూ.2,50,000 మంజూరు చేస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన రూరల్ లబ్దిదారులకు పిఎంఎవై గ్రామీణ్ ఆవాస్ ప్లస్ 2.0 ద్వారా రూ.1,59,000 మాత్రమే ఇవ్వడం వల్ల ఏర్పడుతున్న వ్యత్యాసంపై సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అసమానతను తొలగించి, కాకినాడ రూరల్ లబ్దిదారులకు కూడా రూ.2,50,000 మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, గృహ స్థలాల కేటాయింపులో ఏర్పడిన గందరగోళ పరిస్థితులను కూడా ప్రస్తావించారు. పేపర్లలో మాత్రమే ఉన్న లే ఔట్లు, స్థలం చూపించలేని పరిస్థితి, పట్టాల జారీపై ఉన్న సందిగ్ధతల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యలపై సమగ్ర దర్యాప్తు చేసి, లబ్దిదారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఆహ్వాన పత్రం అందజేత



**తిరువూరు,జనవరి 26 (వార్తాప్రభ) :** మండలం అక్క పాలెం గ్రామంలో మార్చి ఎనిమిదో తారీకు జరగనున్న బొడ్రాయి ముత్యాలమ్మ తల్లి మహాలక్ష్మి తల్లి పోతురాజు స్వామి వార్ల విగ్రహ పున ప్రతిష్ట కార్యక్రమానికి హాజరవ్వాలని విజయవాడ మాజీఎంపీ లగడపాటి రాజగోపాల్ ని కలిసిఆహ్వాన పత్రం అందించినకోదండ రామాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పర్వతనేని జగన్మోహన్ రావు మరియు రేపల్లి మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్కల గాంధీ జనసేన పార్టీ నాయకులు

# అగ్నిప్రమాద బాధితులకు రాధా రంగా మిత్రమండలి నిత్యవసరవస్తువులు అందజేత



**గుడివాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** స్థానిక పుల్లలపాడు వంతెన సమీపంలోని వినాయక గుడి వెనుక జరిగిన అగ్నిప్రమాదంలో ఈడేపల్లి శ్రీదేవి నివసిస్తున్న స్వగృహం అగ్నిప్రమాదం సంబవించి రెండు ఇళ్ళు అగ్ని అహుతు అయిపోవడంతో గురువారం రాధా రంగా మిత్రమండలి సభ్యులు నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు వద్దే గిరి, కమిటీ సభ్యులు కూరాకుల బాబి, పుప్పాల వీరయ్య, వంగూరు ఆంజనేయులు, గోపల్లి బాలాజీ, కావేటి దుర్గాప్రసాద్, వేగే వెంకటతరుణ్, ఎం. మోహన్‌రావు, భాషా, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం





**గుడివాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఉపవాసదీక్షలలో భాగంగా క్రీస్తు శిలువ మార్గ యాత్రలు పట్టణంలోని పెద్దఎరికిపాడు గుడివాడ రూరల్ మండలంలోని తట్టివర్రులోని (ఆర్‌సిఎం) 2 చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఆర్‌సిఎం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ ప్రతాఫ్‌లు ప్రత్యేక ప్రార్ధనలతో, యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్సు కాలమైన 40 రోజుల పాటు ప్రతి గ్రామంలో శిలువ మార్గాలను గుడ్‌ఫ్రైడే వరకు నిర్వహిస్తారన్నారు. ప్రతి వీధిలో 14 స్థలాలు (ఘట్టాలను) వివరిస్తూ శిలువ మార్గాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్సు, ఉపదేశకులు భాస్కర్, ఆంతోని, క్రీసురాజు, సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన తంబళ్లపల్లి



**నందిగామ,జనవరి 26 (వార్తాప్రభ) :** గురువారం నియోజకవర్గం జనసేన పార్టీ ప్రధాన కార్యాలయం నందు క్రియాశీలక సభ్యత్వ నమోదు వాలంటీర్స్ (సాధక్) తో సమావేశం నిర్వహించిన నియోజకవర్గ కన్వీనర్ తంబళ్లపల్లి రమాదేవి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి వారికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా తంబళ్లపల్లి రమాదేవి మాట్లాడుతూ జనసేన ఉద్యమి సభ్యత్వం పొందిన వారికి పార్టీలో సముచిత స్థానం, నాయకులుగా తీర్చిదిద్దడం, వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రతి క్రియాశీలక సభ్యునికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నందిగామ పి ఏ సి ఎస్ చైర్మన్ కొట్టే హరికృష్ణ(బద్రి), నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పురంశెట్టి నాగేంద్ర, చలమల పురుషోత్తం,పెర్న వెంకట్రావు, ఎర్రబడి సురేష్,కరి రమేష్,శెట్టి వెంకటేశ్వరావు,తాడేపల్లి కాంతారావు,ప్రసాదపు కేదార్నాథ్ ,ఐలపోగు నాగేంద్ర, వీరమహిళ చలమల సౌందర్య,కొట్టే వెంకట నర్సమ్మ,కామసాని సుగుణ,బోడపాటి పార్వతి జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# చిత్రలేఖన పోటిలో డా॥కె.కెఆర్ గౌతమ్ విద్యార్థల ప్రతిభ




**గుడివాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** ఇటివల విజయవాడలో స్ఫూర్తి నిర్వహించిన చిత్రలేఖన పోటిలలో డా॥కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్స్ పి.లక్ష్మీ ప్రసాద్, సత్యరామ్, జ్యోతి, ప్రశాంతిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటిలలో జె.సాయినందన్‌కుమార్ కన్సలేషన్ బహుమతి, ఆర్.శ్రేష్ట ద్వితీయ బహమతిని సాధించడం జరిగిందన్నారు. ఈ పోటిలలో గెలపు కారణమైన టిచర్ వి.కామేశ్వరరావు కృషి మరవలేనిదన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా చి॥ జయాన్ష్ పుట్టినరోజు వేడుక..





**చల్లపల్లి/అవనిగడ్డ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు మనుమడు, మేకావారిపాలెం పీఏసీఎస్ చైర్ పర్సన్ , పారిశ్రామిక వేత్త గుత్తికొండ వంశీకృష్ణ - శ్రీజ దంపతుల తనయుడు జయాన్ష్ మొదటి పుట్టినరోజు వేడుక అంగరంగ వైభవంగా జరిగింది.ఆర్ కె కన్వెన్షన్ ఆవరణలో సినిమా సెట్టింగ్ లను తెరిపించే విధంగా చేసిన అలంకరణలు, ఏర్పాట్లు ఔరా అనిపించాయి. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు , ఆర్టిసి చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు, సజ్జా చలపతి రావు,డిసి చైర్మన్ నిధమానూరి దిలీప్ కుమార్,రావెళ్ళ కృష్ణ సేవా సమితి అధ్యక్షులు ఉదయ్ కుమార్, పరుచూరి సురేష్ బాబు,లతో పాటు పలువురు అధికార అనధికార ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు విరివిగా హాజరై చిన్నారి జయాన్ష్ ను ఆశీర్వదించారు.జయాన్ష్ పుట్టినరోజు వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్, మొబైల్ క్రీడా యూనిట్ల వద్ద చిన్నారులు సందడి చేశారు.

## నేను ఎప్పటికీ బిచ్చగాడినే
## మన అజ్ఞానమే మన బలం

ఇది నన్ను వెంటాడే మాట
నన్ను నిరంతరం రగుల్కొలిపే మాట
మనలో జ్ఞానమెంత ఉందో తెలియదు కానీ
అజ్ఞానం మాత్రం టన్నులు టన్నులు ఉంది...
హృదయంలో అశాంతికి కారణం జ్ఞానమా అజ్ఞానమా.... అనుకుంటే..
పూర్తిగా అజ్ఞానంలో ఉన్నవాడికి వాడి అజ్ఞానమే వాడి శాంతి.. ఎందుకంటే వాడికి తెలియనిది... చెప్పినా తోచదు..
పూర్తిగా జ్ఞానంలో ఉన్నవాడికి స్థిరత్వం ఉంటుంది; ఎందుకంటే అతనికి తెలిసిన సత్యమే అతనికి ఆధారం.
మన అజ్ఞానమే మన బలం" అనే విరుద్ధంగా అనిపించే భావనలో
నిజానికి---ఈ రెండింటి మధ్య ఉన్న సంఘర్షణే అశాంతి
కొన్ని సార్లు.....
మన అజ్ఞానమే మన బలం --- వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, లోతుగా ఆలోచిస్తే ఇది జీవిత పాఠం.
"నాకు అన్నీ తెలుసు" అన్న అహంకారం మన ఎదుగుదలకు అడ్డుగోడ అయితే, "నాకు ఇంకా చాలా తెలుసుకోవాలి" అన్న అజ్ఞాన స్వీకరణ మన పురోగతికి ద్వారం. తన అజ్ఞానాన్ని గుర్తించినవాడే నిజమైన జ్ఞాన మార్గంలో అడుగుపెడతాడు. అజ్ఞానాన్ని ఒప్పుకోవడం బలహీనత కాదు; అందుకు చాలా ధైర్యం కావాలి.
అదే ప్రశ్నలు వేయిస్తుంది,
అదే అన్వేషణకు ప్రేరణ ఇస్తుంది.
విద్యార్థి దగ్గర ఉన్న అజ్ఞానమే అతడిని పుస్తకాలవైపు నడిపిస్తుంది. శాస్త్రవేత్త తనకు తెలియని అంశాల వల్లే పరిశోధన చేస్తాడు. రచయిత తన లోటును పూరించుకోవాలనే తపనతో కొత్త ఆలోచనలు సృష్టిస్తాడు.
తన అజ్ఞానాన్ని గుర్తించని వాడు నేర్చుకోవడం ఆపేస్తాడు. కానీ తన పరిమితిని అర్థం చేసుకున్న వాడు ప్రతి అనుభవాన్ని గురువుగా మార్చుకుంటాడు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటాడు, విమర్శను స్వీకరిస్తాడు, మార్పుకు సిద్ధమవుతాడు. ఇదే నిజమైన బలం.
కాబట్టి అజ్ఞానం మనను కుంగదీసే చీకటి కాదు; జ్ఞానానికి తీసుకెళ్లే వెలుగు. దానిని దాచుకోకుండా అంగీకరిస్తే, అదే మన ఎదుగుదలకు పునాది అవుతుంది. నిజమే---మన అజ్ఞానమే మన బలం. ?



నేను కొందరు గురువులు ముందు మోకరిల్లాను...
నేను అజ్ఞానిని...
కరుణించమని ప్రాధేయ పడ్డాను...
వారు దయతో నా భిక్ష పాత్రలో తోచినంత జ్ఞాన భిక్ష వేశారు...
నేనెప్పటికీ బిచ్చగాడినే అని అర్థమైంది...
నాకు భిక్ష వేసిన మొట్టమొదటి గురువు గ్రంథాలయం.
నాకు రెండు పేర్లు అంటే క్రేజ్... ఒకటి కవి. రెండు గ్రంథాలయ పుత్రుడు.

-డాక్టర్ ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది)

# యాదవులారా ఏకం కండి!

- కాటమరాజు జిల్లా సాధనే మన గమ్యం!
- అఖిల భారత యాదవ మహాసభ పిలుపు...
- ఇది దక్షిణాది రాష్ట్రాల తెలుగు యాదవుల వారసత్వానికి పట్టాభిషేకం!



**విజయవాడ, జనవరి 26 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే పలు జిల్లాలకు చారిత్రక పురుషులు మరియు మహనీయుల పేర్లు పెట్టింది. ఉదాహరణకు ఎన్టీఆర్ జిల్లా (ఎన్.టి. రామారావు), వైఎస్ఆర్ జిల్లా (వై.ఎస్. రాజశేఖర రెడ్డి), అల్లూరి సీతారామరాజు జిల్లా (స్వాతంత్ర సమరయోధుడు), అన్నమయ్య జిల్లా (సంకీర్తనాచార్యుడు) ఉన్నాయి. అదే క్రమంలో మార్కాపురం కేంద్రంగా ఏర్పడనున్న జిల్లాకు కాటమరాజు పేరు పెట్టడం అత్యంత సమంజసం. ఇది ఒక చారిత్రక అవసరం మాత్రమే కాదు, ప్రజాకాంక్ష కూడా... అవసమైతే మార్కాపురం జిల్లాను కాటమ రాజు జిల్లా గా ప్రకటించేవరకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేయడానికి అఖిల భారత యాదవ మహాసభ సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్ తెలిపారు...

# బ్యాట్‌తో అదరగొట్టిన మంత్రి వాసంశెట్టి సుభాష్

● ప్రొఫెషనల్ క్రికెటర్‌లా అలరింపుతో.. జట్టు విజయం

● క్రీడల ద్వారా ఆరోగ్యం, స్నేహం, ఉత్సాహమని చాటిన" లెజిస్లేసర్ స్పోర్ట్స్ మీట్"



**విజయవాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** ప్రజా సేవలోనే కాదు, క్రీడా మైదానంలోనూ తనదైన శైలిలో క్రికెట్ ఆడి తన ప్రతిభను చాటిచెప్పారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఇందుకు వేదికయ్యింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు పాల్గొన్న ఆటవిడుపు ఆటల పోటీలు (లెజిస్లేసర్ స్పోర్ట్స్ మీట్ ) ఉల్లాసంగా..ఉత్సాహంగా.. జరిగాయి. ముఖ్యంగా క్రికెట్ పోటీల్లో మంత్రి సుభాష్ తన బ్యాట్‌తో మెరుపులు మెరిపిస్తూ ప్రొఫెషనల్ క్రికెటర్‌లా అలరించారు. మంత్రి అచ్చం నాయుడు వర్సెస్ మంత్రి సత్య కుమార్ టీంల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా "నువ్వా నేనా" అన్నట్టుగా ఉత్కంఠను రేపాయి. మంత్రి అచ్చం నాయుడు టీంలో ఓపెనర్ గా మైదానంలో అడుగుపెట్టిన మంత్రి సుభాష్ చూపిన ఆత్మవిశ్వాసం, షాట్ సెలెక్షన్, టైమింగ్ ప్రేక్షకులను కట్టిపడేసాయి. ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే ఆయన, క్రీడలపట్ల ఉన్న ఆసక్తి, శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని కూడా ఈ సందర్భంగా అందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు క్రీడాస్ఫూర్తితో ఆడుతూ పరస్పర స్నేహభావాన్ని మరింత బలపరిచారు. ప్రజా బాధ్యతల మధ్య కూడా ఇలాంటి ఆటవిడుపు కార్యక్రమాలు శారీరక-మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. మంత్రి సుభాష్ బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన సహచర మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఆయన క్రీడా నైపుణ్యాన్ని ప్రశంసించారు. క్రీడల ద్వారా స్నేహం, ఆరోగ్యం, ఉత్సాహం పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజా సేవలోనే కాదు... క్రీడల్లోనూ ముందుండే నాయకుడిగా మంత్రి సుభాష్ మరోసారి మెప్పించారు. మంత్రి సత్య కుమార్ టీం పై మెరుగైన ఆట తీరు ప్రదర్శించి విజయ తీరానికి చేర్చారు. ఈ ప్రజా ప్రతినిధుల ఆటవిడుపు పోటీలుతో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతా ప్రజా ప్రతినిధులతో కళకళలాడింది.

# గుడివాడలో కాంగ్రెస్‌కు కేరాఫ్ అడ్రస్ న్యాయవాది రాజశేఖర్...

● రాజకీయం చేయటం కంటే...ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...

● రాజకీయమైనా...నల్లకోటు అయినా...ప్రజలకే అంకితం... ● ప్రముఖ హైకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నం రాజశేఖర్ లైఫ్‌స్టైల్ ఇది...









**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** గుడివాడలో కాంగ్రెస్ పార్టీకి ప్లస్ అయినా...ఎసెట్ అయినా సరే ప్రముఖ హైకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నం రాజశేఖర్ అనే చెప్పాలి. సమాజంలో యువ ఉత్తుంగ తరంగంలా ప్రజా సమస్యల పరిష్కారానికై రాజశేఖర్ తన పోరాట పటిమతో ఉద్యమిస్తున్నారు. 16ఏళ్ల వయసు నుంచే ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న ఆయన పోరాట పటిమను చూసిన కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కూడా రాజాను నియమించారు. షర్మిల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆరు నెలల క్రితం మచిలీపట్నంలో ఆ పార్టీకి సంబంధించిన నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజశేఖర్ నియమించారు. ఏ నియోజకవర్గంలో ఇంతవరకు షర్మిల ఇన్‌చార్జులను నియమించక ముందు రాజశేఖర్ ప్రజా పోరాట ఉద్యమాలను దృష్టిలో పెట్టుకుని తొలిసారిగా ఇన్‌చార్జిని ప్రకటించటమే గాక అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని వెంటనే పంపించారు. రాజకీయం చేయటం కంటే...ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజశేఖర్ తన పోరుబాటలో నడుస్తున్నారు. రాజకీయమైనా...నల్లకోటు అయినా...ప్రజలకే అంకితమని ఆయన చెబుతున్నారు. జంగారెడ్డి గూడెంలో 50కుటుంబాలు కల్తీ మద్యానికి బలైతే...మానవ హక్కుల సంఘం ద్వారా ఆ విషయాన్ని ఆయన బట్టబయలు చేశారు. ఆ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోర్టు ద్వారా ఉద్యమిస్తున్నారు. ఆయన పోరాట ఫలితంగా కల్తీ మద్యం అంశంపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శికి కూడా మానవ హక్కుల నుంచి ఆయా బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. యునైటెడ్ ఇండిపెండెంట్‌కు చైర్మన్‌గా, ఎన్‌హెచ్‌వైలో రాజశేఖర్ వివిధ పదవుల్లో పని చేసి ఉద్యమాలకు ఊపిరి పోశారు. స్టేట్ కాంగ్రెస్ హ్యూమన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన ఆయన రాష్ట్రమంత్రా పర్యటించారు. అన్ని ప్రాంతాల్లో కమిటీలను వేసి భారీ ఎత్తున పోరాటాలను చేపట్టారు. నేషనల్ మానవ హక్కుల కమిటీతో కూడా పని చేసి ప్రజలకు సమస్యా పరిష్కారం కావాలంటే రాజశేఖరే చిరునామాగా మారారు. దీనితో ఏఐసీసీ అధినాయకుడు రాహుల్ గాంధీ వద్ద ప్రశంసలు పొందారు. ఎస్సీ, బీసీ యువకులపై ఎలాంటి కేసులు లేకపోయినా...రౌడీ షీటర్లగా అడ్డగోలు షీట్లను బనాయించిన పోలీసు వ్యవస్థకు ఆయన తగిన బుద్ధి చెప్పారు. కోర్టు ద్వారా అడ్డగోలు రౌడీ షీట్ల బనాయింపులను తొలగించేసరికి బాధితులు ఊపరి పీల్చుకున్నారు. గుడివాడలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ఆయన పని చేస్తున్నారు. తన కార్యాలయానికి రాలేనటువంటి సామాన్యుల చెంతకు ఆయన వెళ్లి పని చేస్తున్నారంటే ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఒక ఆటో డ్రైవర్‌గా అవతారమెత్తి...ప్రజా సమస్యలను తెలుసుకోవటమే గాక...వాటి పరిష్కారానికై నిర్విరామ కృషి చేస్తున్నారు రాజశేఖర్.

# నీట్-2026కు పూర్తిస్థాయిలో సన్నద్ధత - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ గురువారం నీట్-2026 పరీక్ష నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై సమగ్ర నివేదికను సమర్పించారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు సంబంధించిన కేంద్రాలను సిద్ధంగా ఉంచడం, భద్రతా చర్యలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ జిల్లాలో పరీక్ష నిర్వహణను సీసీటీవీల ద్వారా పర్యవేక్షించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. పరీక్ష పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్‌టీఆర్ జిల్లా నీట్ పరీక్షల సమన్వయకర్త డా. ఎం.గోపీకృష్ణ పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన సిబ్బంది సమన్వయం, కేంద్రాల పర్యవేక్షణ తదితర అంశాలపై ఆయన వివరాలు తెలియజేశారు. జిల్లాలో నీట్--2026 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర సన్నద్ధతతో ఉందని అధికారులు తెలిపారు.

# అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం

● ఎన్ని కష్టాలు ఎదురైనా మండల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ లు ఎంతగానో సహకరించారు

● పదవీకాలం ముగిస్తున్న వేళ సర్పంచ్ లను సన్మానించడం సంతోషంగా ఉంది

● మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి






**మైలవరం,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికి మండల అభివృద్ధికి గ్రామపంచాయతీ సర్పంచ్ లు ఎంతగానో సహకరించారని మండల పరిషత్ అధ్యక్షురాలు ఇస్లావతు ప్రసన్న రాణి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభా మందిరంలో ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం ఎంపీడీవో పి.అనురాధ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసన్న రాణి మాట్లాడుతూ సర్పంచ్ ల పదవీకాలం ముగిస్తున్న వేళ ఈ సర్వసభ్య సమావేశం వారికి ఆఖరిది కావటం,అలాగే గడచిన ఐదేళ్లు వారు ప్రజలకు అందించిన సేవలు మరువరానివని కొనియాడారు. నిధుల లభ్యతను బట్టి మండల పరిషత్ నుంచి గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని ఆమె వెల్లడించారు.అంతకు ముందు ఎంపీడీవో పి.అనురాధ శాఖల వారీగా ఆయా శాఖలలో జరిగిన అభివృద్ధి పనులు, జరగాల్సిన పనులు గురించి సభలో అధికారులతో రివ్యూ నిర్వహిం చారు. ఈ రివ్యూ లో విద్య, వైద్యం,విద్యుత్, వ్యవసాయం, ఆర్డబ్ల్యూఎస్, మహిళ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్), హౌసింగ్, పంచాయతీ రాజ్,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వెలుగు పథకం శాఖలకు సంబంధించిన అధికారులు వారు చేపట్టిన అభివృద్ధి పనుల గురించి సభ్యులకు వివరించారు.అలాగే మూడు నెలల కు సంబంధించి మండల పరిషత్ బడ్జెట్, ఖర్చులు గురించి సభ్యులకు వివరించారు. అయితే సర్వసభ్య సమావేశానికి పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు గైర్హాజర్ అయ్యారు.

**సర్పంచ్ లను ఘనంగా సన్మానించిన ఎంపీపీ ప్రసన్న రాణి-స్వామి దంపతులు:** మండలంలోని గ్రామపంచాయతీ సర్పంచ్ ల ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న వేళ వారికి ఈ సర్వసభ్య సమావేశం ఆఖరిది కావడంతో ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి, స్వామి దంపతులు ఎంపీడీవో పి.అనురాధ, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు కార్యాలయా సిబ్బందితో కలిసి సర్పంచ్ లను గౌరవ మర్యాదలతో ఘనంగా సన్మానించారు.పూల దండలు, శాలువ కప్పి షీల్డ్ అందించారు. పంచాయతీరాజ్ డిఇ

**ఎంపీపీ ప్రసన్న రాణి-స్వామి దంపతులకు ఘన సన్మానం:** సర్పంచ్ లకు గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఆఖరిది కావడంతో వివిధ గ్రామాల సర్పంచ్ లు ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి-స్వామి దంపతులను ఘనంగా సన్మానించి వారి అభిమానాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రత్తిపాటి రత్నబాబు, పంచాయతీరాజ్ డిఈ ఎం.వెంకన్న, డిప్యూటీ ఎంపీడీవో జయ ప్రకాష్,ఎంపీటీసీ లు, పిఎసిఎస్ చైర్ పర్సన్ లు,కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరుణాల మహోత్సవం


● వివిధ శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించిన ఆలయ కార్యనిర్వాహణాధికారి బి మహేశ్వర్ రెడ్డి...




**పెనుగంచిప్రోలు,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ దేవస్థానం నందు ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి బి .మహేశ్వరి రెడ్డి సమన్వయ సమావేశం నిర్వహించారు. నందిగామ డివిజన్ ఆర్డివో.బాలకృష్ణ. ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ఈ ఓ మాట్లాడుతూ ది.26.02.2026 గురువారం మధ్యాహ్నం శ్రీ తిరుపతమ్మ దేవస్థానము నందు నిర్వహించనున్న శ్రీ అమ్మవారి చిన్న తిరునాళ్ల పుట్టింటి పసుపు కుంకుమ బండ్ల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ రెవిన్యూ డివిజన్ అధికారి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సమావేశం లో నందిగామ డివిజన్ ఆర్డీవో బాలకృష్ణ అన్ని శాఖల వారు అమ్మవారి చిన్న తిరునాళ్ళు మహోత్సవమును విజయవంతం చేయవలసినదిగా వివిధ శాఖల సిబ్బందికి తగు సూచనలు సలహాలు జారీ చేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి, పెనుగంచిప్రోలు మండలం తాసిల్దార్, శాంతిలక్ష్మి పెనుగంచిప్రోలు మండలం ఎంపీడీవో.శ్రీను.డీసీపిలలిత కుమారి,.సీఐ.పి. వెంకటేశ్వరరావు. ఎస్ ఐ కే అర్జున్. ప్రాథమిక ఆరోగ్య శాఖ డాక్టర్ అనురాధ. ఫైర్ స్టేషన్ సీఐ.అగ్నిమాపక సిబ్బంది , కార్యనిర్వహక ఇంజనీరు మరియు వివిధల శాఖల సిబ్బంది పాల్గొన్నారు డిప్యూటీ కమిషన్ కార్యనిర్వహణాధికారి బి మహేశ్వర్ రెడ్డి తెలియజేసినారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆలయ ఈ ఈ.రమ.ఆలయ ఏవో రాజు ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు సూపరింటెండెంట్ లక్ష్మణ్ ప్రాథమిక ఆరోగ్య శాఖ డాక్టర్ అనురాధ పంచాయితీ కార్యదర్శి శ్యాం కుమార్ మరియు వివిధ శాఖలకు సంబంధించిన ఉన్నత అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు....

# హిందూ దేవాలయాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించిన కోగంటి

● రూ: 2లక్షల విరాళాలు ప్రకటన


**జి.కొండూరు, ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ(సత్యం) పలు హిందూ దేవాలయాలకు తన సొంత నిధుల నుంచి విరాళాలు ప్రకటించారు.ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్, జి.కొండూరు మండలం కవులూరు గ్రామంలోని హిందూ దేవాలయాలకు కోగంటి సత్యం రూ. 2 లక్షల విరాళంగా ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. కొండపల్లిలో శివారు శాంతినగర్ గ్రామంలోని రామాలయం అలాగే కవులూరు గ్రామంలోని శ్రీ కాళికామాత దుర్గాదేవి ఆలయాలను కోగంటి గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా కోగంటి సత్యనారాయణ కు ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నిధులను ఆయా దేవాలయాల ధర్మకర్తలకు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోగంటి సత్యనారాయణ ను ఆయా దేవాలయాలకు సంబంధించిన ధర్మకర్తలు ప్రత్యేకంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఆలయాల అభివృద్ధి పనుల నిమిత్తం లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2 లక్షలు ఇవ్వనున్నట్లు కోగంటి సత్యం తెలిపారు.దేవాలయాల పూజా రులు కోగంటి సత్యం ను వేదమంత్రాలు సాక్షిగా ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బొర్రా కోటేశ్వరావు, పినపాక గ్రామ మాజీ సర్పంచ్ గరికపాటి జైపాల్, సిహెచ్. ప్రసాద్, నాగభూషణ చారి,సి హెచ్ శివ కోటేశ్వరరావు, ఆలయ పూజారి ఆంజనేయ చారి తదితరులు పాల్గొన్నా రు.

# హనుమాన్ జంక్షన్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు..



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 26 (వార్తాప్రభ) :** పాల వ్యాపారస్తులు వద్ద తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ సేకరించిన ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ గోపాలకృష్ణ. ఇటీవల రాజమండ్రిలో పాలు కల్తీ జరిగి కొంతమంది మృతి చెందగా దానిని దృష్టిలో ఉంచుకొని కృష్ణా జిల్లా ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా వ్యాప్తంగా వ్యాపారస్తులు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామని ముందుగా శాంపిల్స్ సేకరించి వాటిని ల్యాబ్ కు పంపించిన తర్వాత వచ్చిన రిజల్ట్స్ ని బట్టి చర్యలు ఉంటాయని అన్నారు. ఎవరైనా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడి పాలు కల్తీ చేసి వ్యాపారం సాగిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని నిన్న మచిలీపట్నంలో చేసాం నేడు హనుమాన్ జంక్షన్ లో చేశామని మరల ఆకస్మిక తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఏది గేద పాలు ఏది కల్తీ పాలు అన్న విషయాలు తెలుసుకోవాలని నాణ్యమైన పాలు అమ్మే వారి దగ్గర మాత్రమే పాలు కొనుగోలు చేయాలని సూచించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188